మినీ కథ



# ధర్మాత్ముడు

పాకల చిరంజీవిదేవి

శ్రీవారికి సుప్రభాతం పాడి, వంటే, బుజ్జిగాళ్ళని కాన్వెంటుకు తయారుచేసి వాళ్ళు కాన్వెంటుకు, శ్రీవారు ఆఫీసుకు వెళ్ళడంతో కాస్త వెసులుబాటు కలిగింది. సోఫాలో వెనక్కు వాలి వీక్లీలో సీరియల్ ప్రారంభిద్దామనుకునేసరికి వింధ్య ప్రత్యక్షమయింది. దాన్ని చూస్తూనే జ్ఞాపకం వచ్చింది—ముందురోజు రాసుకున్న లిస్టు. ఇవాళ యిద్దరం కలిసి సూపర్ బజారుకు వెళ్ళామనుకున్నాం. పుస్తకం మూసేసి, దాన్ని కూచోబెట్టి, ఫ్లాస్కులో టీ చుక్కలు దాని మొహాన కొట్టి, అది వాట్ని మింగేలోగా లిస్టు, మనీబేగ్‌తో తయారయ్యాను.

పది గంటలవేళ. ఆఫీసు వేళలు కావడంచేత సిటీ బస్సులన్నీ చాలా రద్దీగా వున్నాయి. గబ్బిలాల్లా వేళ్లాడుతున్నారు ప్రయాణికులు—ఫుట్‌బోర్డు గజాలు పట్టుకుని. వేళ్లాడుతున్న ఆ గబ్బిలాల మధ్య నుంచి దూరలేక, దూరం నడవలేక, చివరికి తెగించి నువ్వు సగం, నేను సగం అనుకుని ఓ ఆటోలో ఎక్కేశాం. సూపర్ బజారు దగ్గర దిగి చిల్లర దగ్గర కాస్త పేచీపడి, ఆటోవాణ్ణి వదిలించుకొని బజారు గేట్లోకి దూరబోతుండగా, కాస్త దూరంలో ఓ గుంపు కనిపించింది. లంగా, జాకెట్టు వేసుకున్న ఓ పదేళ్ళ అమ్మాయిని జనం చుట్టుముట్టి గదమాయించడం గమనించాం. ఆ అమ్మాయి ఏడుస్తోంది. గుంపులోని ఓ తీవ్రవాది ఛడాల్న ఆ అమ్మాయి దవడ వాయించడం చూడగానే వింధ్య అటు దూసుకుపోసాగింది. ఇదో తీవ్రవాది. అంచేత నేనూ దాని వెంట పరిగెత్తాను. అప్పటికే వింధ్య ఆ కొట్టిన యువకుణ్ణి దులపరించేస్తుంది. వాకబు చేయగా ఆ అమ్మాయి ఆ గుంపులో వున్న ఓ వ్యక్తి జేబు కొట్టబోయి దొరికిపోయింది. వెక్కి వెక్కి ఏడుస్తోందా అమ్మాయి.

"ఎందుకు చేశావీ పని" అడిగాన్నేను.

వెక్కుతూనే చెప్పింది. తండ్రి లేదు. తల్లి ఆరోగ్యం చెడి మంచం ఎక్కింది. డాక్టరు రాసిన మందులు కొనడానిక్కాదుకదా — తిండానిక్కూడా లేని పరిస్థితిని అతి దీనంగా వివరించిందా అమ్మాయి.

గుంపులో కదలిక ప్రారంభమయింది. అందులోంచి ఓ భారీ ఆకారం తెల్లని లాల్చీ, పంచె, కండువాతో ముందుకొచ్చింది. ఆ హుందాతనం, ముఖంలో వర్చస్సు చూస్తే, కోనసీమలో కనీసం పది కొబ్బరి తోటలకు యజమానై వుంటాడనిపిస్తుంది. ఆ అమ్మాయి తల నిమిరి, కన్నీళ్ళు తుడిచి, అందర్నీ ఓసారి చూశాడతను. తీవ్రవాది వేపు తల తిప్పేలోగా అయిపు లేకుండా పోయాడతను.

"ఇంత చిన్నవయసులో ఈ అమ్మాయి ఈ సాహసం ఎందుకు చేసిందో మీరు విన్నారు. ఎండిపోయి, డొక్కుపోయిన దవడలు, కడుపు చెప్తున్నాయి దానిక్కారణాలు" అంటూ ఆత్మీయంగా ఆ అమ్మాయినూసి, లాల్చీ జేబులోంచి ఓ యిరవై రూపాయిల నోటు ఆ అమ్మాయి చేతిలో పెట్టి, చెమరుస్తున్న కళ్ళతో వెళ్ళిపోయాడా ధర్మాత్ముడు.

కందిన ఆ పాప బుగ్గ నిమురుతూ "ఇంకెప్పుడూ ఇలాంటి పన్లు చెయ్యకు పాపా" అంటూ బుజ్జగించి, బాగ్‌లోంచి పది రూపాయిలు తీసి ఆ అమ్మాయి చేతిలో వుంచింది వింధ్య. నాతోబాటుగా చుట్టూ వున్నవాళ్ళు కూడా తమకు తోచినంతగా ఆ అమ్మాయికి ఎంతో సానుభూతితో సాయం చేశారు. నా మనస్సులో ముద్రించుకుపోయిందా సంఘటన. ఇరవై రూపాయిలిచ్చిన ఆ ధర్మాత్ముని ముఖం, ఆ నిర్మలత్వం, హుందాతనం. గుంపు చెదిరిపోగా మేం సూపర్ బజారులో దూరి కావాల్సిన సామాన్లు కొనుక్కుని యింటి దారి పట్టాం.

ఆ సంఘటన జరిగిన పదిహేనురోజులకి ఓ బంధువులింట్లో ఒక పార్టీకని బయల్దేరాను. హిమయత్ నగర్‌లో వాళ్ళిల్లు. వెళ్తూండగా పక్కనున్న గల్లీలోంచి ఎవరో ఎవర్నో గదమాయించడం వినిపించింది. యథాలాపంగా అటు చూసేసరికి మతిపోయినట్లయింది. వాళ్ళుక్కనిపించకుండా, కాస్త పక్కకు సర్దుకుని వాళ్ళ మాటలు వినసాగాను. వాళ్ళలో ఓ పెద్ద మనిషి షరాయి, లాల్చీతో వున్నాడు. ప్రక్కన మోటార్ సైకిలు. పదిహేనేళ్ళ కుర్రాడు, పదేళ్ళ అమ్మాయి వున్నారు.

లాల్చీ పెద్దమనిషి అంటున్నాడు. "ఇంత ట్రయినింగిచ్చినా యింకా దారికి రాలేదేం మీరు. మీతో బాటు మాట పడిమంది. సిటీలో అన్ని రూట్లలో మిమ్మల్ని చూసుకోవాలంటే మీరు తెచ్చింది పెట్రోలుకయిపోతుంది. ఇక మీదయినా అదును చూసుకుని దెబ్బ కొట్టడం నేర్చుకోండి. లేదా మక్కెలిరగదంతాను. జేబులో చెయ్యి పెట్టగానే సరి కాదు, అది మన చేతికందిన మరుక్షణం పక్కనున్న మనోడికి పారెయ్యాలి. అదీ టెక్నిక్కు. ఈసారైనా సురుగ్గా పని చూసుకుని కార్ఖానాకొచ్చేయండి" (కార్ఖానా అంటే వాళ్ళ స్థావరం అన్నమాట). ఆ పిల్లలిద్దరూ "అలాగే దాదా" అంటూ వినయంగా తలూపారు. అంతే. మోటార్ సైకిల్ స్టార్టయిన శబ్దం. నేను కాస్త ప్రక్కకు తప్పుకోగానే నా ముందు నుంచే వెళ్ళిందది. దాని మీది మనిషిని చూడగానే గిర్రున బుర్ర తిరిగింది నాకు. వీడు, ఆనాడు ఓ అనాథకు ఇరవై రూపాయిల ధర్మం చేసినవాడు—జేబుదొంగలకు బాస్.

నా ముందు నుంచే నవ్వుకుంటూ, కేరుకుంటూ వెళ్తున్న ఆ యిద్దరు పిల్లల్లో ఆనాటి సూపర్ బజారు దగ్గర జేబు కొట్టబోయి దొరికిపోయిన అమ్మాయి! ●